క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

తాడికొండ: తాడికొండ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తాళ్ళ భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు వివిధ విభాగాల మండల స్థాయి అధికారులు తమ తమ విభాగాల అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఫిరంగిపురం: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు విశ్వనాథుని హరిబాబు అన్నారు. మండల కేంద్రంలో అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు జి.చంద్రశేఖర్, జిల్లా కోశాధికారి రావూరి, నారాయణరావు, ఆర్.కోటి చంద్రశేఖరరెడ్డి, గడ్డం రాంబాబు, బత్తెన సుబ్బారావు, నేరెళ్ల శివనాగేశ్వరరావు, చదలవాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఫిరంగిపురం: మండలంలోని పలు ప్రభుత్వ మద్యం దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది తమకు ప్రభుత్వం నుంచిఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో సోమవారం తహసీల్దార్ రాజరమేష్ మోహన్‌ను కలసి విన్నవించారు. అక్టోబర్ ఒకటిన ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ఏర్పాటు చేస్తుందని చెప్పారు. మద్యం దుకాణాలు ప్రయివేటీకరణ చేస్తే తమ ఉద్యోగాలు తీసివేయకుండా వేరొక చోట తమను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కొనసాగించేలా అవకాశం కల్పించాలని కోరారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయండి

ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు




తాడికొండ: గ్రామ అభివృద్ధి ప్రణాళికలు(2024–25) సిద్ధం చేయాలని ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం తాడికొండ మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఆదాయం పెంచేందుకు గాను ఇంటిపన్ను వసూలు, చెరువులలో చేపల పెంపకం చేసి వాటిని వేలం వేయడం ద్వారా వచ్చే ఆదాయం, దుకాణాల ద్వారా వచ్చే అద్దెలు, ఇతర ఆదాయ మార్గాల పెంపుపై తెలియజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ చంద్రశేఖర్ పలువురు సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కలకలం!

తాడికొండ: బాలికను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అందించిన వివరాలు.. స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న బాలికను మత్తుమందు ఇచ్చి కారులో తనను కిడ్నాప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పృహ వచ్చే సమయానికి గుంటూరులో ఉన్నానని, కిడ్నాప్ చేసిన వ్యక్తులు బయట వివాదం ఆడుకుంటుండగా డోరు తీసుకొని పారిపోయి బంధువులకు ఫోన్‌చేసి వారి ద్వారా తాడికొండ చేరుకున్నట్లు చెబుతుందని వివరించారు. అనంతరం తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలలో ఏమైనా వివరాలు లభ్యమైతే తప్ప క్లూ దొరికే అవకాశం లేదని పోలీసులు చెబుతున్నారు.

సొసైటీ మాజీ అధ్యక్షుడు కళ్లం మృతి



తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక సొసైటీ మాజీ అధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నాయకులు కళ్లం రామమోహన్‌రెడ్డి(55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీపీఎం నాయకులు జొన్న శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ అధ్యక్షులుగా పనిచేసిన కాలంలో రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లేవారని గుర్తు చేశారు. కళ్లం మృతదేహాన్ని సందర్శించిన వారిలో ఈశ్వరరెడ్డి, ఎర్రపీరు ఉన్నారు.



గౌతమబుద్ధా రోడ్డులో అడ్డంగా ఉన్న ఆవులు



టిడ్కో నివాసాల వద్ద వీధి కుక్కలు

ఇదేం చోద్యం..

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అడ్డు అదుపు లేకుండా ఆవులు రోడ్ల వెంబడి తిరుగుతున్నాయి. మొబైల్ స్పీడ్ బ్రేకర్లు లాగా ఉంటున్నాయి. ఇటీవల గౌతమబుద్ధా రోడ్డుపై పడుకున్న ఆవులను గమనించని ద్విచక్ర వాహనదారుడు ఆవుని ఢీకొట్టడంతో వాహనదారుడితో పాటు వెనుక కూర్చుని ఉన్న మరో యువకుడు తీవ్ర గాయాల పాలై మృతి చెందిన విషయం తెలిసిందే. ఆవులను గోశాలకు తరలిస్తున్నా గోశాల వారు మరలా వదిలేస్తుండడంతో మళ్లీ ఆవులు రోడ్లపైకి చేరుతున్నాయి. ఇక కుక్కలు యథావిధిగా రోడ్లపై విహారం చేస్తుండడంతో చిన్నారులు, విద్యార్థులను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. –మంగళగిరి

ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా కేఎల్‌యూలో ర్యాలీ

తాడేపల్లిరూరల్: మండలం పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం ర్యాగింగ్‌కు వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ర్యాగింగ్ శిక్షార్హమైన నేరమని అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఒక గైడ్‌గా, సోదరుల్లా మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ 42 ఏళ్ల చరిత్ర కలిగిన కేఎల్‌యూలో ర్యాగింగ్ అనేది లేదని, విద్యార్థులు స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ఎఫ్ఈడీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, విద్యార్థి సంక్షేమ విభాగ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతురమ్య, డాక్టర్ శ్రీధర్, కార్యక్రమ కో ఆర్డినేటర్, సైకాజలిస్ట్ విజయరత్నం, సుధీర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రో వీసీ డాక్టర్ ప్రసాద్

వీఆర్‌కు తుళ్లూరు–2 సీఐ అనూరాధ

తాడికొండ: తుళ్లూరు–2 సీఐగా పనిచేస్తున్న అనూరాధను సోమవారం వీఆర్‌కు రిపోర్ట్ చేయాలని ఆదేశాలు రావడంతో ఆమె రిలీవ్ అయ్యారు. ఏ కారణం చేత వీఆర్‌కు పంపించారు అనే వివరాలు ఇంకా తెలియరాలేదు.

నోట్‌బుక్స్ అందజేత



తాడేపల్లిరూరల్: నగరపాకల సంస్థ పరిధిలోని తాడేపల్లి అంజిరెడ్డి నగర్‌లోని ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్‌లు, స్టేషనరీని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నాయకులు పెరికే బాబు విచ్చేసి పుస్తకాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనూరాధ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దేశంతో విద్యార్థులకు పుస్తకాలు,ప్యాడ్‌లు స్టేషనరీ అందజేసిన దాత పెరికె బాబును అభినందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీచర్లు వి.రాజు, నాగరత్నం పాల్గొన్నారు.

హాస్యానికి చిరునామా రేలంగి

లక్ష్మీపురం: హాస్యానికి చిరునామా రేలంగి అని ప్రజా గాయకుడు రమణ, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం హస్య నటుడు రేలంగి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్యం అపహాస్యం కాకుండా పోషించిన నటుల్లో రేలంగి ప్రథములని తెలిపారు. రేలంగి అన్న పేరు వింటేనే ముఖాన నవ్వు దానంతట అదే వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనర్ బిళ్లా అశోక్, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కేవీపీ కాలనీకి చెందిన 19 సంవత్సరాల యువతి అలిగి ఇంట్లోంచి ఆదివారం ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథ పాలకులకు ఆదర్శనీయుడు రంగనాథన్

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథ పాలకులకు ఎస్.ఆర్.రంగనాథన్ ఆదర్శనీయులని గుడివాడ ఏఎన్ఆర్ కళాశాల విశ్రాంత గ్రంథ పాలకుడు పావులూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం గ్రంథ పాలకుల పితామహుడు రంగనాథన్ 129వ జయంతిని పురస్కరించుకుని జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ 129 ఏళ్లు గడిచినా రంగనాథన్‌ను గుర్తుంచుకోవడానికి ప్రధాన కారణం గ్రంథాలయ వ్యవస్థపై అంతర్జాతీయస్థాయిలో ఆయన చేసిన కృషేనని వివరించారు. ఈ సందర్భంగా పుస్తక సమీక్షపై పోటీల్ని నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్‌పర్సన్ సీహెచ్. అరుణ, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్, గ్రంథ పాలకులు సుబ్బారావు, శ్రీజ, తెలుగు విభాగాధిపతి వై. మల్లికార్జునరావు పాల్గొన్నారు.

స్వాతంత్య్రోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం

తెనాలిఅర్బన్: స్వాతంత్య్రోద్యమంలో తెనాలికి ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రణరంగచౌక్‌లోని క్విట్ ఇండియా ఉద్యమంలో అశువులుబాసిన వారి స్మారకార్థం నిర్మించిన స్థూపాలకు సోమవారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపు ఇచ్చినప్పుడు తెనాలిలో ఏడుగురు స్వాతంత్య్ర సమరయోధులు బ్రిటీష్‌వారి కాల్పుల్లో అశువులుబాశారని గుర్తు చేశారు. వారిని ప్రతి సంవత్సరం స్మరించుకోవడం జరుగుతుందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం సమయంలో తెనాలిలో జరిగిన కాల్పుల ఘటన స్వాతంత్య్రోద్యమానికి నాంది పలికిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, కొర్ర యశోద, యాతాటి అనీల్, తోట రఘురామ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాలి శేషాచలం, దేసు శ్రీనివాసరావు, కఠారి హరీష్, బూరెల దుర్గా, షేక్ మీరావలి, పెదలంక వెంకటేశ్వర్లు, అత్తోట శ్యామ్, కుక్కల వాసు, తాడిబోయిన రమేష్, మల్లిబోయిన రాము, గోల్డ్ రహిమా, కుర్రా శ్రీను, అక్కిదాసు కిరణ్, దౌలాత్, గుర్రం హేమలత, రావి రాంబాబు, టెక్స్ బాల, బ్రహ్మం, కొడాలి క్రాంతి, కొల్లా గురునాధగుప్తా, గుంటూరు కృష్ణ, కోలా వాసు, కావేటి నిర్మల, కాళిదాసు సత్యం, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో రణరంగచౌక్‌లో అమరవీరుల స్థూపాలకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఆలపాటి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమంలో అశువులబాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనేక ఉద్యమాలకు తెనాలి పుట్టిల్లు అని చెప్పారు. ఎందరో మహానుభావులు స్వాతంత్య్రోద్యమంలో పాల్గొని తెనాలి ప్రాంత కీర్తిని మరింత ఇనుమడింపజేశారని కొనియాడారు. ముందుగా టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా రణరంగచౌక్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొత్రపాటి లక్ష్మి, అన్నం పిన్నారావు, బోయపాటి అరుణ, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, టీడీపీ నాయకులు తాడిబోయిన హరిప్రసాద్, రమాదేవి, జొన్నాదుల మహేష్, మహ్మద్ ఖుద్దూస్, నలుకుర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బెర్రి స్కూలు ఆధ్వర్యంలో...

బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్ ఆధ్వర్యంలో రణరంగచౌక్ వద్ద అమరవీరుల స్థూపాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని తెలియజేసే నృత్యాన్ని చేశారు.

కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన నగర విద్యార్థిని

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలో ఆదివారం జరిగిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో హిందూ ఇంజినీరింగ్ కళాశాల డిప్లొమా ఈఈఈ మొదటి సంవత్సర విద్యార్థిని దాసరి శ్రీసాహితి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నం సుబ్బారావు తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో సోమవారం జరిగిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అండర్–40 కేటగిరీలో పాల్గొన్న 300 మంది అభ్యర్థులతో పోటీ పడిన తమ విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ పి.ఐజాక్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడా నైపుణ్యాల్ని వెలికితీసేందుకు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థిని సాహితి భవిష్యత్తులో మరెన్నో విజయాల్ని అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, ఈఈఈ విభాగాధిపతి ఐతపు నాగాంజనేయులు, ఫిజికల్ డైరెక్టర్ రవి పాల్గొన్నారు.



సాహితిని అభినందిస్తున్న సుబ్బారావు

చిత్రకళా నైపుణ్యంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: చిత్రకళా నైపుణ్యంతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథా లయంలో మధుర్ ఆర్ట్ స్కూల్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వాతంత్య్ర సమరయోధుల పెన్సిల్ పోర్ట్రైట్ చిత్రకళా ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ చిత్రాలను గీసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ, విశ్రాంత ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి, ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య, గ్రంథ పాలకులు కె. చిన్నపరెడ్డి, ఎన్. నాగిరెడ్డి, మద్దినేని సుధాకర్, మధుర్ ఆర్ట్ స్కూల్ వ్యవస్థాపకుడు పి. మధుసూదనరావు పాల్గొన్నారు.



చిత్రకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మధుసూదనరావు

మాదక ద్రవ్యాల వినియోగం దేశానికి హానికరం

ఆర్డీఓ పి.శ్రీకర్

గుంటూరు వెస్ట్: మాదక ద్రవ్యాల వినియోగం కేవలం శరీరానికే కాదని, దేశానికి కూడా హానికరమని రెవెన్యూ డివిజన్ అధికారి పి.శ్రీకర్ పేర్కొన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ నుంచి నిర్వహించిన ర్యాలీని ఆయనతో పాటు డిప్యూటీ మేయర్ షేక్ సజీల జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శ్రీకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు ఉన్న బలం యువతరమేనని తెలిపారు. నేడు ఎన్నో దేశాలకు మనకున్న యువశక్తి బలం లేదని చెప్పారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం యువతను తప్పుదోవ పట్టించడంతో పాటు మత్తుకు బానిసలుగా చేస్తున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎదిగిన తమ పిల్లల రోజువారీ కార్యక్రమాలతో పాటు స్నేహితుల గురించి వాకబు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు పిల్లల్ని గమనించాలని చెప్పారు. మత్తు పదార్థాలు తీసుకునే వారిని సంఘం కూడా గౌరవించదని తెలిపారు. అనంతరం ర్యాలీ మార్కెట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, మహిళా శిశు సంక్షేమాధికారి ఎం.ఉమాదేవి, జీఎంసీ డీసీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారి సువార్త పాల్గొన్నారు



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆర్డీఓ పి.శ్రీకర్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. శైలజ తెలిపారు. పట్టాభిపురంలోని నగరపాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం అసెంబ్లీ జరుగుతున్న సమయంలో ఆమె సందర్శించారు. విద్యార్థులతో నిషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుట్కా, పాన్‌పరాగ్ ఆరోగ్యానికి హాని కలిగిస్తాయని తెలిపారు. మాదక ద్రవ్యాల్ని సేవించడం ద్వారా క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని హెచ్చరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండటంతో పాటు తమ ఇళ్ల పరిసర ప్రాంతాల్లో అందరినీ చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని చెప్పారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన కోర్సులతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- చలపతిలో బీటెక్ తరగతులు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మోతడక(తాడికొండ): ప్రపంచీకరణలో భాగంగా వస్తున్న మార్పులకనుగుణంగా నూతన కోర్సులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని విద్యార్థులు భవిష్యత్‌కు పునాదులు వేసుకుంటూ ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరంగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన బీటెక్ మొదటి ఏడాది ప్రారంభ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు ఉత్తమ విద్యనందించాలనే సదుద్దేశంతో వైవీ ఆంజనేయులు సారథ్యంలో ప్రారంభించిన చలపతి విద్యా సంస్థలు మంచి సత్ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలను పెంచుకొని ఉన్నత విద్యావకాశాలు మెరుగు పరుచుకోవాలని అప్పుడే వారి జీవన స్థితులు మెరుగుపడతాయన్నారు. మరో అతిథి ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఆర్‌టీ రామస్వామి మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రాథమిక సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా రాబోయే నాలుగేళ్లలో భవిష్యత్ విజయవంతంగా మలుచుకోవడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధతో ప్రత్యేక నైపుణ్యం కలిగిన సిబ్బందిని ఏర్పాటు చేసి విద్యాబోధన చేపడుతున్నామని, విద్యార్థులు శ్రద్ధతో చదివి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చేలా కొలువుల్లో స్థిరపడాలని సూచించారు. అతిథులను చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి గాలి జయప్రకాశ్, అకడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్, ఎగ్జామ్స్ డీన్ సుబ్బారావు, బేసిక్ సైన్స్ విభాగాధిపతి శంకరరావు పాల్గొన్నారు.

కాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- బకింగ్ హామ్ కెనాల్‌లో ఆత్మహత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించిన వృద్ధుడు
- కిలో మీటరు నీటిపై కొట్టుకొచ్చిన వృద్ధుడు
- కాపాడిన మత్స్యకారులు



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని బయటకు తీసుకొచ్చిన మత్స్యకారులు

తాడేపల్లి రూరల్: కాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధుడిని మత్స్యకారులు కాపాడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉండే జంధ్యాల రామమూర్తి(75) వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జి వద్దకు సోమవారం రాత్రి వచ్చి బ్రిడ్జిపై నుంచి నీటిలోకి దూకాడు. రామమూర్తి లుంగి ధరించి ఉండటంతో నీటిలో మునగలేదు. అక్కడ నుంచి తేలుకుంటూ వస్తున్న సమయంలో రామరామ అంటూ పెద్ద పెద్దగా కేకలు వేయడంతో 750 మీటర్ల తరువాత కాలువ ఒడ్డున ఉన్న యువకులు గమనించారు. సెల్‌ఫోన్ లైట్ల సహాయంతో చూశారు. కాలువ ఒడ్డున ఉన్న మత్స్యకారులకు విషయం చెప్పడంతో కిలో మీటరు అనంతరం తూటికాడ పట్టుకుని ఉన్న వృద్ధుడిని అర్ధగంట సేపు తరువాత మత్స్యకారులు బయటకు తీసుకొచ్చారు. మత్స్యకారులు వసంత కుమార్, నాగరాజు వృద్ధుడిని కాపాడారు. వృద్ధుడు పూర్తి చిరునామా చెప్పలేకపోవడంతో స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

టీచర్ల సర్దుబాటు నిబంధనలు సవరించాలి: ఫ్యాప్టో

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలు సవరించి ప్రాథమిక విద్యను కాపాడాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ ఎం.కళాధర్ కోరారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారులకు సోమవారం డిమాండ్లతో కూడిన లేఖలు అందజేశారు. ఈ సందర్భంగా కళాధర్ మాట్లాడుతూ 3,4,5 తరగతుల విలీనంతో అనేక ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితుల్లోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుత ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలు అదే విధంగా ఉండి మరిన్ని పాఠశాలలు మూతబడే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలు మూతపడితే భవిష్యత్తులో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఏ విధంగా చేరతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పిల్లలు తగ్గిన పాఠశాలలను మూసివేయడం కాకుండా ప్రవేశాలు పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే సర్దుబాటు నిబంధనలు సవరించాలని కోరారు. ఉన్నత పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించడంతోపాటు ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

కర్రసాము పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిలంబం స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం బీఆర్ స్టేడియంలో నిర్వహించిన పోటీలో అండర్–17 విభాగంలో తమ విద్యార్థి ఆర్. డార్విన్, అండర్–14 విభాగంలో సీహెచ్ చైతన్య, డి. చిన సూర్య, పి. అస్మా, కె.సాయి సహస్ర, ఎం. మోక్షిత్, అనుదీప్, రిత్విక్ సంజయ్, తేజశ్వర్, మనోహర్, రేవంత్, సాత్విక్, పాల్ చైతన్య బంగారు పతకాలు కైవసం చేసుకున్నట్లు వివరించారు. డబుల్ స్టిక్స్ ఫైటింగ్ అండర్–14 విభాగంలో రేవంత్, అండర్–11లో వసంత్ బంగారు పతకాలను సాధించినట్లు తెలిపారు. కర్రసాము ద్వారా ఆత్మరక్షణతో పాటు శక్తి, సూక్ష్మబుద్ధి అలవడతాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి. రత్తయ్య మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యమివ్వాలనే లక్ష్యంతో చివరి పీరియడ్‌లో 16 యాక్టివిటీస్‌ను కరిక్యులమ్‌లో జత చేసి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల ఏఓ కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



విద్యార్థులతో కృష్ణప్రసాద్, రత్తయ్య

మహిళల ఆర్థిక ప్రగతికి కృషి

గుంటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల వ్యక్తిగత, వృత్తి పరమైన ఎదుగుదల కోసం, జీవన నైపుణ్యాలతో కూడిన ఫేస్ కార్యక్రమాన్ని ముగించామని వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ, ఫేస్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ సురేష్ తెలిపారు. సోమవారం ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 30 రోజులుగా ఫేస్ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. రచయిత లావిన మాట్లాడుతూ ఫేస్ కార్యక్రమం కుట్టు పరిశ్రమలోని మహిళల సామర్థ్యాలు పెంపొందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. గ్యాప్ ఇంక్ కుటీర పరిశ్రమలో 2007లో నలుగురు మహిళలతో ప్రారంభమై నేడు 24 దేశాల్లో 13 లక్షల మంది మహిళలకు చేరుకుందని వివరించారు. శిక్షణ పొందిన మహిళలు ఆత్మవిశ్వాసంతో వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో సమర్థంగా రాణించగలుగుతున్నారని చెప్పారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ బైజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నీరు, పారిశుద్ధ్యం కోసం తమ వంతు సహాయాన్ని సంస్థ ద్వారా అందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు సాయి, సునీల్ కుమార్, వేణు అంగన్‌వాడీ కార్యకర్తలు సీతామహాలక్ష్మి, ఇందిరా పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన రామిశెట్టి లక్ష్మమ్మ(80) ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు రాగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించగా మృతి చెందింది. వైద్యశాల నుంచి సోమవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమవారం రాత్రి తెలిపారు.